ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఉచిత వైద్య సేవలు



63వ వార్డులో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న బద్రీనాథ్, రామ్మోహనరెడ్డి



52వ వార్డు వైద్య శిబిరంలో ముందుల కిట్ అందజేస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: ప్రజారోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తోందని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు శాంతినగర్ సామాజిక భవనంలో శనివారం ఏర్పాటు చేసిన జగన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బి.ఎస్.కృష్ణతో కలిసి ఆయన ప్రారంభించారు. సాకేతపురం–2 పరిధిలోని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఊరూరా స్పెషలిస్ట్ వైద్యులను పంపించి, అన్ని వర్గాల ప్రజానీకానికి మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేయటం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రజలంతా వైద్య సేవలు పొందేలా ఆరోగ్య, సచివాలయ, ఆశ కార్యకర్తలు వార్డు పరిధిలోని కాలనీల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. బి.ఎస్.కృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటి ముంగిటే కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందన్నారు. డిప్యూటీ మేయర్ శ్రీధర్ వ్యాధినిర్ధారణ పరీక్షలతోపాటు, కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జియ్యాని మారుతి, సింహాచలం ట్రస్టు బోర్డు సభ్యురాలు శ్రీదేవి వర్మ, శ్రీను పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో పేదలకు మేలు

సింథియా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దక్షతకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిదర్శనమని వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ అన్నారు. పేదలకు మేలు చేస్తున్న ఈ కార్యక్రమం దేశం గర్వించే స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. 63వ వార్డు ఏకేసీ కాలనీ సచివాలయం–2 పరిధి కాకరలోవలో శనివారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సూచనల మేరకు పార్టీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి హాజరైన ప్రజలకు ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



60వ వార్డు వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య నిపుణులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



61వ వార్డు వైద్య శిబిరంలో మెడికల్ కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ కొణతాల సుధ

60వ వార్డులో 110 మందికి వైద్య సేవలు.

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీ సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు జీవీఎల్ నరేష్,ఆ డారి హరీష్ తదితరులు అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైద్య నిపుణులు పలువురు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సుమారు 110 మంది వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

61వ వార్డులో 130 మందికి..

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరడిమాంబ కల్యాణ మండపం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. కార్పొరేటర్ కొణతాల సుధ, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ వైద్య పరీక్షలను పరిశీలించి రోగులకు మందులు కిట్లు అందజేశారు. సుమారు 130 మంది వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు జీవీఎస్ఎన్ రాజు(కేబుల్ వాసు), కొల్లి నూకరెడ్డి, మంగ, ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య సేవలు

గోపాలపట్నం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో సేవలు అద్భుతంగా ఉన్నాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చంద్రనగర్–2 సచివాయలం పరిధిలో ప్రజలకు శనివారం శిబిరంలో వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నేతలు అయితంశెట్టి గోపాలకృష్ణ, నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు పరిశీలించారు. మొత్తం 300 మందికి పైగా వైద్య సేవలు అందించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా మంచి కార్యక్రమాన్ని ప్రజలకు అందించారన్నారు. శిబిరంలో జనరల్, కంటి, గైనిక్, పిల్లలు, ఆర్థోపెడిక్, దంత వైద్య నిపుణులు సేవలందించారు.



చంద్రనగర్‌లో కిట్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గోపి, పైడిరాజు

క్లుప్తంగా

34 మందికి కొలువులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు

గోపాలపట్నం: నరవ బెహరా విద్యాసంస్థల్లో పాలిటెక్నిక్, ఐటీఐ చదువుతున్న 34 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యారు. ఇటీవల దువ్వాడలోని విశాఖ స్పెషల్ ఎకానామిక్ జోన్‌లో హోబెల్ బెల్లోస్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 34 మంది విద్యార్థులను ఆ సంస్థ ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ అధికారి గోవిదరాజు, కంపెనీ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్లు మురుగన్, రుద్రేష్, కిషోర్, విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.

సింహగిరిపై ఈ- హుండీ పునరుద్ధరణ



ఫోన్‌తో స్కాన్ చేసి నగదు చెల్లిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరిపై ఈ హుండీని శనివారం నుంచి పునరుద్ధరించారు. సింహగిరికి వచ్చే భక్తుల సౌకర్యార్థంర్థం గోగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం ద్వారా హుండీ కానుక చెల్లించే విధానం గతంలో ఉండేది. కొన్ని కారణాల దృష్ట్యా దాన్ని నిలిపివేశారు. తాజాగా దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఈ హుండీ విధానాన్ని ప్రవేశపెట్టారు. దీనిలో భాగంగా ఆలయ రాజగోపురం వద్ద స్కానర్ ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని స్కానర్లు ఏర్పాటు చేస్తామని ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు.

సంజీవరెడ్డిని కలిసిన షిప్‌యార్డ్ ఇంటక్ నాయకులు



అధ్యక్షుడు సంజీవరెడ్డితో నాయకులు

సింథియా: ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, షిప్‌యార్డ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సంజీవ రెడ్డిని శనివారం షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు నవంబర్ 18వ తేదీన జరగనున్న షిప్‌యార్డ్ గుర్తింపు ఎన్నికల ప్రణాళికతో పాటు ఎన్నికల అనంతరం చేయబోవు కార్యచరణను వివరించారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

బౌద్ధాలయంలో పౌర్ణమి పూజలు



పేద మహిళలకు చీరలు అందజేస్తున్న అతిథులు, బౌద్ధ సమాజం సభ్యులు

కంచరపాలెం: ఆశ్వయుజ మాస శుద్ధ పౌర్ణమి సందర్భంగా శనివారం కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో బుద్ధిడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో సీనియర్ ఉపాసకుడు కోన వెంకటరావు ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులు మయన్మార్ ఆంధ్ర రీప్యాటియేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఎం ఫ్రెడ్డీ, కార్యదర్శి మోహన్‌రావు బుద్ధుడి చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం పేదలకు అన్నదానం జరిపారు. కార్యక్రమంలో రాజు, భీమారావు, రాము, రామచంద్రరావు, పరిమళ, సునీల్, సమాజం సభ్యులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐపై దాడి చేసిన పది మందిపై కేసు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ ఏఎస్‌ఐపై దాడికి పాల్పడిన పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామకృష్ణానగర్ తొండం వినాయకుడి గుడి వద్ద దసరా నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవి విగ్రహం అనుపు కార్యక్రమంలో భాగంగా డీజే సౌండ్స్ ఎక్కువగా రావడంతో స్థానికులు డయల్ 112కు కాల్ చేశారు. నైట్ రౌండ్స్‌లో ఉన్న ఫోర్త్‌టౌన్ ఏఎస్‌ఐ శివకృష్ణ అక్కడికి వెళ్లి నిర్వాహకులకు సౌండ్ తగ్గించాలని చెప్పారు. వారిలో మద్యం తాగిన మత్తులో ఉన్న కొంత మంది ఏఎస్‌ఐ విధులకు ఆటంకం కలిగించారు. వెంకటసూర్యనారాయణతో కలిసి పది మంది ఆయనపై దాడి చేశారు. స్టేషన్ అధికారి విజయకుమార్‌కు కాల్ చేసి విషయం చెప్పడంతో.. ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దీంతో కొంత మంది యువకులు పారిపోయారు. రంగంలోకి దిగిన పోలీసులు పది మందిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంపత్ వెంకన్నకు సుప్రభాత సేవ



సంపత్ వేంకటేశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మిదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్యామాచార్యులు ఆధ్వర్యంలో వెంకన్నకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయంలో మూలవిరాట్‌లకు చక్రస్నాన పూజలు జరిపారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. చంద్ర గ్రహణం కావడంతో సాయంత్రం 6 గంటలకు ఆలయాన్ని మూసివేశారు.

సాయి దివ్యజ్యోతితో విశ్వకాంతులు

- శ్రీసత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి రత్నాకర్
- రాష్ట్రస్థాయి యువజన సదస్సు ప్రారంభం



ఆధ్యాత్మిక పత్రికను ఆవిష్కరిస్తున్న అతిథులు

పెదగంట్యాడ: భగవాన్ సత్య సాయిబాబా వెలిగించిన దివ్వెలు విశ్వకాంతులు వెదజల్లుతున్నాయని శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి ఆర్‌జే రత్నాకర్ అన్నారు. సాయిబాబా ఒక సత్సంకల్పంతో బలమైన పునాది వేశారని, దీని ఆధారంగా లక్షలాది మంది మానవతా విలువలతో విశ్వవ్యాప్తంగా అనేక దేశాలలో నిస్వార్థంగా సేవలందిస్తున్నారని చెప్పారు. జీవీఎంసీ 77వ వార్డు ఏపీ మెడ్‌టెక్ జోన్‌లోని ఆంపియర్ హాల్లో రాష్ట్ర యువజన సదస్సును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని, పేదలు, అణగారిన వర్గాలకు సేవలందించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. సత్యసాయి సేవా సంస్థలో యువత పెద్ద సంఖ్యలో చేరి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు.

ముందుగా ప్రశాంతి పతాకను సత్యసాయి సేవా సంస్థల ఆలిండియా అధ్యక్షుడు నిమిష్ పాండ్య, స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, వీ స్టీల్ మహిళా సేవా సమితి ప్రెసిడెంట్ నుపుర్ భట్, ఏపీ మెడ్‌టెక్ జోన్ ఎండీ, ఫౌండర్ సీఈవో జితేంద్ర శర్మ, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌జీ చలం, ఆర్.లక్ష్మణరావు ఎగరవేశారు. అనంతరం శ్రీవాణి ఆధ్యాత్మిక పత్రికను ఆవిష్కరించారు. ఆపై అతిథులను ఘనంగా సత్కరించారు. ఏపీలోని మొత్తం 26 జిల్లాల్లో 1200 మంది యువతీయువకులు ఈ సదస్సుకు హాజరయ్యారు. కార్యక్రమంలో స్నేహలత సాయి, జాతీయ సేవా కో–ఆర్డినేటర్లు, రాష్ట్ర కో–ఆర్డినేటర్లు, సత్యసాయి సేవా సంస్థల జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నేడు మాధవధార కొండపై ట్రెకింగ్

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ సంఘం ఆధ్వర్యంలో అందరికీ ఆరోగ్యం, ప్రకృతి అందాల వీక్షణం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ట్రెకింగ్ నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు మాధవధార మాధవ స్వామి ఆలయం గుడి మెట్ల దగ్గర ట్రెకింగ్ ప్రారంభమై సింహాచలం శ్రీ వరహా లక్ష్మీ నరసింహ స్వామి గుడి వద్ద ముగుస్తుందన్నారు. మానవ సేవే మాధవ సేవ సభ్యుల తోపాటు స్థానికులు, వారి కుటుంబ సభ్యులు, స్నేహితులతో ట్రెకింగ్‌లో పాల్గొనవచ్చని చెప్పారు. ఈ మార్గంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహిస్తామని, కొండపై పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపునకు విత్తనాలు చల్లుతామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 76598 04633, 92966 01500 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎన్‌ఎంయూ రిలే నిరాహార దీక్ష

ఉక్కునగరం: ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోలో ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో శనివారం రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. డిపో స్పేర్ నుంచి లిస్ట్ అయిన వారికి అదే డిపోలో పోస్టింగ్ ఇవ్వాలని, ఉద్యోగులకు లీవు సౌకర్యం మెరుగు పరిచి నెలకు మూడు సెలవులు ఇవ్వాలనే పలు డిమాండ్లపై దీక్ష చేపట్టారు.

5న బీసీ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ మహాసభ



మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: బీసీ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ ప్రథమ మహాసభను నవంబర్ 5వ తేదీన తిరుపతిలో నిర్వహించనున్నట్లు బీసీ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ జి.వి.రమణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆటోనగర్‌లోని బీసీఈఎఫ్ కార్యాలయంలో కార్యక్రమం పోస్టర్‌ను ప్రతినిధులు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉండవల్లి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కె.వి.ఆర్.మూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.చిన్నారావు, నాయకులు బి.నాగేశ్వరరావు, గొలగాని సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఉచిత వైద్య పరీక్షలు



పోలీసులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దొండపర్తి : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు పోలీస్ రీజనల్ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కేర్, మెడికవర్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 100 మంది పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో బీసీలు ముఖ్యమంత్రులు కావాలి



మాట్లాడుతున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ.పాల్

సీతమ్మధార : తెలుగు రాష్ట్రాల్లో బీసీలు ముఖ్యమంత్రులు కావాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ. పాల్ అన్నారు. శనివారం ఆశీలమెట్టలో గల పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పలు బీసీ సంఘాలు తమ పార్టీకి మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నాలుగు లక్షల మంది క్రైస్తవ ఓటర్లు ఉన్నారని, ఐదు వేల చర్చిలు ఉన్నాయన్నారు. తుమ్మిడి బ్రదర్స్ అధినేత రామ్‌కుమార్, పలువురు మహిళలను పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో నవంబర్ 9వ తేదీన 10 గంటలకు బీసీ మహాసభ జరుగుతుందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల బీసీ సంఘాలు పాల్గొంటాయని తెలిపారు. తాను వచ్చే ఎన్నికల్లో విశాఖ ఎంపీగా పోటీ చేస్తానన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తానే అడ్డుకున్నానన్నారు. తుమ్మిడి బ్రదర్స్ అధినేత రామ్‌కుమార్, బీసీ నాయకులు ఎస్.ఎ.రమణ, ఎస్‌సీ అప్పారావు, పలువురు మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తూ పార్టీ కండువాలు కప్పారు.

యాదవులకు రాజకీయ ప్రాధాన్యం అవసరం



అతిథులను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

మల్కాపురం: యాదవులను గుర్తించి, ప్రాధాన్యం కల్పించిన పార్టీకి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని శ్రీకృష్ణ యాదవ్ సంక్షేమ సంఘం ప్రతినిధులు అన్నారు. సంఘ తొలి వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో యాదవులు అధిక సంఖ్యలో ఉన్నారని, తమ వర్గంలో చాలా మంది యువత సాంకేతికంగా, విద్య పరంగా ఉన్నత హోదాల్లో ఉన్నారని పేర్కొన్నారు. రాజకీయంగా తాము ఉన్నత శిఖరాల్లో ఉండేందుకు.. ఏ పార్టీ వారైతే తమను పోత్సాహిస్తారో వారికి ఎప్పుడు తాము అండగా నిలుస్తామని చెప్పారు. వార్షికోత్సవం సందర్భంగా సంఘ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లా సోమేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నమ్మి అప్పలరాజు యాదవ్, గౌరవ సలహాదారులుగా ఉరుకూటి మహాలక్ష్మినాయుడు, కార్యదర్శిగా పాము వేణు, కోశాధికారిగా పల్లా శివ తదితర సభ్యులను ఎంపిక చేశారు. కొత్తగా ఎన్నికైన వారిని సంఘ సభ్యులు అభినందించారు. సంఘ వ్యవస్థాపకులు నంబారు సంతోష్‌కుమార్, చేదుల శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

బీఎంఎస్‌తోనే కార్మికులకు న్యాయం



సమావేశంలో పాల్గొన్న బీఎంఎస్ ప్రతినిధులు, సభ్యులు

మల్కాపురం: షిప్‌యార్డ్ కార్మికులకు బీఎంఎస్ యూనియన్‌తోనే న్యాయం జరుగుతుందని బీఎంఎస్ జాతీయ నాయకుడు ఎం.జగదీష్ అన్నారు. 61వ వార్డు వెంకన్నపాలెం వద్ద షిప్‌యార్డ్ బీఎంఎస్ యూనియన్ నాయకులు, సభ్యుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ బీఎంఎస్ క్రమశిక్షణతో కూడిన యూనియన్ అని, కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. తాము అధికారంలో లేని పలు చోట్ల ఆయా పరిశ్రమల్లో కార్మికులకు నాయ్యం జరిగేలా పోరాటాలు చేసి విజయం సాధించిన చరిత్ర ఉందన్నారు. వచ్చే నెలలో షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ఎన్నికలు జరగనున్నాయని, తమ యూనియన్ వెంట పలువురు ఉద్యోగులు, ఎల్ అండ్ సిరీస్ కార్మికులు అండగా నిలవడం తొలి విజయంగా భావిస్తున్నట్టు చెప్పారు. యూనియన్‌లోని సభ్యులంతా ఐక్యంగా బీఎంఎస్ విజయానికి శ్రమించాలని పిలుపునిచ్చారు. తమ యూనియన్ అధికారం చేపట్టిన తరువాత సంస్థలో పనిచేస్తున్న ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసేలా శ్రమిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ విశ్రాంతి ఉద్యోగి, బీఎంఎస్ నాయకులు రవిరాజ్, షిప్‌యార్డ్ బీఎంఎస్ యూనియన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డులోని 482, 482 సచివాలయం పరిధిలో ఆర్పీలతో పాటు పొదుపు సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అక్క చెల్లమ్మలకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ దసరా, దీపావళి సందర్భంగా ఈ చీరలు అందించారని తెలిపారు. ఆయన నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. కొన్ని సందర్భాల్లో తన సొంత నిధులు సైతం ఖర్చు చేస్తున్నారని తెలిపారు. పద్మనాభనగర్‌లో కాపు కల్యాణ మండపాన్ని గత ప్రభుత్వం మధ్యలో వదిలేసిందని.. ఆ విషయాన్ని స్థానిక కాపు నాయకులు ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగానే ఆ భవనం పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేశారన్నారు. ఇలాంటి నాయకుడికి మనం అండగా నిలిచి పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివారావు, నాయకులు ఊటపల్లి గోవిందు, బండి దుర్గేష్, వెంకట్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఐజీ కాలనీలో పందుల బెడద



ఎంఐజీ కాలనీ గెడ్డలో సంచరిస్తున్న పందులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఎంఐజీ కాలనీలోని గెడ్డలో పందుల సంచారం ఇటీవల ఎక్కువైంది. కొంత కాలం నుంచి కనిపించని పందులు శనివారం ఉదయం పదుల సంఖ్యలో సంచరించడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఈ సమస్యపై ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో.. పందులను తరలించే కార్యక్రమం చేపట్టారు. పందుల పెంపకందారులు వారి వాహనాల సాయంతో ఇక్కడ వాటిని విడిచిపెట్టి వెళ్లిపోతున్నట్టు కాలనీవాసులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నృసింహుడికి వైభవంగా ఆర్జిత సేవలు



గరుడ సేవలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అదిష్ఠింపజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్ శిక్షణకు ఏయూ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిధిలోని జాతీయ సేవా పథకం నుంచి ఐదుగురు వలంటీర్లు ఎంపికయ్యారు. వీరిని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఏయూ అనుబంధ కళాశాలకు చెందిన అఫ్రీన మీర్జా మహమ్మద్, కె.రచన, కె.కేధశ్రీ, పి.హేమలత, ఎస్.కల్యాణిలు నవంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కేఎల్ యూనివర్సిటీలో జరిగే ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొంటారు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా జరిగే ఇటువంటి కార్యక్రమాలకు ఏయూ విద్యార్థులు ఎంపిక కావడంపై వీసీ సంతోషం వ్యక్తం చేసి విద్యార్థినులను అభినందించారు. కేఎల్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య పార్థసారధి వర్మ, ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.